హైదరాబాద్ వార్త



## నార్సింగిలో మూసీని ఆనుకొని కడుతున్న నిర్మాణాలు హైడ్రా తనిఖీ

**నార్సింగి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూసీనదిని ఆనుకొని ఆదిత్య కన్స్ట్రక్షన్ నిర్మిస్తున్న కట్టడంను మంగళవారం హైడ్రా అధికారులు సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండిపేట జలాశయం గేట్లు ఎత్తితే ఆ వరద నీరు ఆదిత్య కన్స్ట్రక్షన్ లోపలికి వచ్చింది. ముందుగానే సదరు బిల్డర్ రిటైనింగ్ వాల్ కట్టినా వరద నీరు దాన్ని ముంచెత్తి పైదాకా వచ్చింది. ఆ సమయంలోనే స్థానికులు ఫొటోలు, వీడియోలు తీసి మూసీ వరద నీరు వచ్చేంత వరకు మూసీ బఫర్‌జోన్ కాదా? అని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అధికారులకు ఆదిత్య కన్స్ట్రక్షన్ కనిపించడం లేదా? అంటూ ప్రశ్నించారు. దీంతో హైడ్రా అధికారులు మంగళవారం ఆదిత్య కన్స్ట్రక్షన్‌ను పరిశీలించి వెళ్లారు. మూసీ ఎంత విస్తీర్ణం ఉంది..? దాని బఫర్ జోన్ ఎక్కడి వరకు వస్తుందీ? అన్న అంశాలను తేల్చేందుకు అధికారులు పర్యటించారన్న గుసగుసలు వినిపించాయి.



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూసీని ఆనుకొని కడుతున్న ఆదిత్య కన్స్ట్రక్షన్‌ను పరిశీలించేందుకు వచ్చిన హైడ్రా అధికారులు




**జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

**ఒకపక్క రాజకీయ పార్టీలు ప్రచారంలో మునిగిపోయాయి.. ప్రధాన పార్టీల అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.. గల్లీగల్లీకి తిరుగుతూ ఓటు తమకే వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు.. నామినేషన్లు దాఖలు చేయడానికి సమాయత్తమవుతున్నారు.. మరోవైపు ప్రధాన పార్టీ అయిన బీజేపీ ఇంకా అభ్యర్థి ప్రకటన వియషయంలో సందిగ్ధంలోనే ఉంది.. నామినేషన్ దాఖలుకు, ఉపసంహరణకు మరో అయిదు రోజులే గడువు ఉన్నా ఇంతవరకు అభ్యర్థిని తేల్చకపోవడంతో కింది స్థాయి కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది.**

### - బిజెపిలో అభ్యర్థి విషయంలో తొలగని ఉత్కంఠ - తెరపైకి విక్రమ్‌గౌడ్

### దూకుడులో ప్రధాన పార్టీలు

ఒకవైపు అధికార పార్టీకి నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో సమావేశాలు, సభలు నిర్వ హిస్తున్నారు. పార్టీ నేతలంతా ప్రచారంలో మునిగితేలుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ సైతం అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతగోపీనాథ్‌ను అభ్యర్థిగా ప్రకటించడమే కాకుండా ఆమెకు పార్టీ అధినేత కేసీఆర్ బీఫారంను సైతం అందించారు. ఇప్పటికే పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పేరుతో రహ్మత్‌నగర్ డివిజన్‌లో ఆమె భారీ బహిరంగ సభను నిర్వహించారు. కేటీఆర్, హరీష్‌రావు తదితరులతో సభను విజయవంతంగా నిర్వహించారు. నామినేషన్ సైతం వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా వివిధ పార్టీల నుండి, స్వతంత్రులుగా ఇప్పటికే దాదాపు 20 మంది నామినేషన్లను దాఖలు చేశారు. ఒక వైపు నియోజక వర్గంలో ని అన్ని



డివిజన్‌లలో రాజకీయ ప్రచారం వేడెక్కగా బీజేపీ నేతలు, కార్య కర్తలు ఇంకా అడుగు బయటకు వేయలేకపోతున్నారు.

### తేల్చేదెప్పుడు..

బీజేపీ అభ్యర్థి వ్యవహారంలో చాలా రోజులుగా నాన్చుడి ధోర ణితో వ్యవహరిస్తుంది. జిల్లా అధ్యక్షుడు, గత ఎన్నికల్లో అ భ్యర్థిగా నిలిచిన లంకల దీపక్‌రెడ్డికి తిరిగి ఈ ఎన్నికల్లోనూ టిక్కెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతున్నప్పటికి ఆశావాహులు ఈ సారి టిక్కెట్ దక్కించుకొనేందుకు బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థి ప్రకటన ఆలస్యమవుతుందని తెలుస్తుంది. ప్రధానంగా టిక్కెట్ రేసులో ఉన్న జూటూరు కీర్తికరెడ్డి, వీరపనేని పద్మ టిక్కెట్ దక్కించుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు తాజాగా మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ తాను బరిలో ఉన్నానని, అవకాశం కల్పిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి తాను సిద్దంగా ఉన్నట్లు ప్రకటించాడు. ఒకవైపు పార్టీ అధినాయకత్వం అభ్యర్థిని తేల్చకపోవడంతో కింది స్థాయి నాయకులు, కార్యకర్తల్లో అసహనం పెరుగుతుంది. ఒకవైపు సొం తంగా పార్టీ కోసం కొందరు ప్రచారం చేస్తున్నప్పటికి అభ్యర్థి తేలకపోవడంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. అభ్యర్థి వ్యవహారం ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉండటంతో ఎప్పుడు కన్‌ఫార్మ్ అవుతుంది.. ప్రచారంలోకి ఎప్పుడు దూసుకెళ్లాలనే ఆలోచనలో కిందిస్థాయి నేతలు ఎదురుచూస్తున్నారు.

## తహాసీల్ ఆఫీస్ ఎదుట యువకుడి ఆత్మహత్యయత్నం

**-పాస్‌బుక్స్ జారీలో జాప్యం చేస్తున్నందుకే ఘటన..**

**-రికార్డుల ఆధారంగా నివేదిక అందజేశాం: తహాసీల్దార్ సయ్యద్ మతీన్**

**దుండిగల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

భూమికి సంబంధించిన పాస్‌బుక్స్ జారీ చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ ఓ యువకుడు మంగళవారం గండిమైసమ్మ దుండిగల్ మండలం తహాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించడం చర్చనీయాంశంగా మారింది. మా పూర్వీకుల నుండి వచ్చిన స్థలం మాపేరు మీద మార్చాలంటూ దరఖాస్తు చేసుకున్నాము. పరిశీలించిన అధికారులు పాస్‌బుక్కులు జారీ చేయకుండా కాలయాపన చేస్తూన్నారని తెలిపారు. ఆత్మహత్యకు యత్నించిన యువకుడు తెలిపిన వివరాల ప్రకారం..గండిమైసమ్మదుండిగల్ మండలం, గాగిల్లాపూర్ పరిధి సర్వే నంబర్ 148,150లలో తమకు 14గుంటల భూమి ఉందన్నారు. సదరు భూమిని మా కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించాలని ధరఖాస్తు చేసుకున్నాము. నాటి నుండి నేటి వరకు భూబదలాంపు చేయడం లేదని మండిపడ్డారు. మాభూమి మావాళ్ళ పేరు మీదకు బదలాయించేందుకు అధికారులు ఏమిటి ఇబ్బంది అంటూ ప్రశ్నించారు. ఇక తిరగడం మావల్ల కాదని ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. ఇప్పటికైనా మాపూర్వీకుల నుండి వచ్చిన భూమిని మావాళ్ళ పేరుకు బదలాయించి పాసుబుక్కులు అందజేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇక్కడకు చేరుకొని యువకుడికి నచ్చజెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.


తహాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిద్ధునాయక్

### రికార్డుల పరిశీలించి నివేదిక అందజేశాం: తహాసీల్దార్ సయ్యద్ మతీన్

ఇదే విషయమై తహాసీల్దార్‌ను ప్రభాతవార్త ప్రతినిధి వివరణ కోరగా ఈవిధంగా స్పందించారు. గాగిల్లాపూర్ వివిధ సర్వేనంబర్లలలో 77 ఎకరాల భూదాన్ స్థలం ఉంది. అందులో సర్వేనంబర్ 148, 150లో బానోత్ ఫకీర్ అనే వ్యక్తికి భూదాన్ స్థలం 14 గుంటలు కేటాయించారు. ఫకీర్ కుమారులు మోహాన్, రవిలు ఉన్నారు. మోహాన్ కూతురు స్వాతి, రవి భార్య సునీత ఇద్దరు తమ పేరు మీదకు భూమిని బదలాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. దానిలో భాగంగా మేము రికార్డుల పరిశీలించినప్పుడు ఫకీర్ భార్య లక్ష్మీతో పాటు మరో ముగ్గురు 21గుంటల భూమిని డాక్యుమెంట్ 14709/2005 విక్రయించినట్లు తేలింది. ఒకసారి ఇసిలో ట్రాన్సక్షన్ జరిగిన పిదప నిబంధనల ప్రకారం సక్షేషన్ చేయడం కుదరదు. ఇదే విషయాన్ని నివేదికలో పొందుపరిచి మాపై అధికారులకు అందజేశాము. తదుపరి వారి ఆదేశానుసారం జరుగుతుంది. పాసుబుక్కులు జారీ చేసే అధికారం తహాసీల్దార్‌కు లేదు. మమ్మల్ని పాసుబుక్కులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తూ ఇలాంటి ఘటనలకు పాల్పడడం సరికాదు. కాగా గాగిల్లాపూర్‌లోని 77ఎకరాల భూదాన్ స్థలాల్లో ఉన్నటువంటి ఎన్‌వోసిలను సైతం క్యాన్సిల్ చేస్తూ కలెక్టర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

## మాగంటి సునీతాగోపీనాథ్, కుమార్తెపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌తోపాటు ఆమె కుమార్తెపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ)ను ఉల్లంఘించి ప్రార్థన స్థలాల వద్ద అనుమతులు తీసుకోకుండా మాగంటి సునీత, ఆమె కుమార్తె మాగంటి అక్షరతోపాటు కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్ తదితరులు ఎన్నికల ప్రచారం చేశారని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ డిప్యూటీ తహసిల్దార్ ఫ్రాన్సిస్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటగిరిలోని ప్రార్థన స్థలం వద్ద వీరు ప్రార్థనాస్థలాల వద్ద నియమావళికి విరుద్ధంగా వ్యవహరించడంతో ఈ కేసును నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు కవల పిల్లల్ని చంపి గృహిణి ఆత్మహత్య

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

కుటుంబ కలహాల కారణంగా ఓ గృహిణి తన ఇద్దరు కవల పిల్లల్ని గొంతు నులిమి చంపి తాను కూడా మూడో అంతస్తుపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలనగర్ ప్రాంతంలోని పద్మారావు నగర్ పేజ్ ఒకటిలో మృతురాలు చల్లారి సాయి లక్ష్మి (27) భర్త అనిల్ కుమార్, ఇద్దరూ కవల పిల్లలైన కార్తికేయ(2) లాస్యత వల్లీ(2)లతో కలిసి కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులకు తోడు భార్య భర్తల మధ్య తరచూ జరిగే గొడవల కారణంగా ఇరువురి మధ్య కుటుంబ కలహాలతో మంగళవారం తెల్లవారుజామున సాయిలక్ష్మి తన ఇద్దరు కోవలలను గొంతు నులిమి చంపివేసింది. అనంతరం మానసిక వేదనకు గురైన సాయి లక్ష్మి అదే ఇంట్లోనే మూడో అంతస్తుపై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు బాలనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెంపుడు కుక్కను చంపారని.. జలమండలి కార్యాలయంపై దాడి

**జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః**

జలమండలి కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి సామాగ్రి, ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌పురి కాలనీలో ఉన్న హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కార్యాలయానికి సోమవారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వచ్చారు. అగంతకులు వచ్చిరాగానే ఆగ్రహంతో ఫర్నీచర్, కుర్చీలు, ఫ్యాన్లు, బల్లలు, కేబిన్ అద్దాలు ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న డివిజన్-6 జీపీఆర్ సీవరేజీ బోర్డు అధికారి మురళి వారిని అడ్డుకొనేందుకు యత్నించారు. ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించగా మీ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల మా కుక్క(బావ్) చనిపోయిందంటూ తేల్చిచెప్పారు. ఈ సంఘటనపై మురళి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వాటర్ ట్యాంకర్ డ్రైవర్ గఫ్బార్ వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల తమ పెంపుడు కుక్క బావ్ చనిపోయిందని, అతనిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలంటూ వికాస్ పురి కాలనీకి చెందిన వైభవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను గఫ్బార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్తీ..కల్తీ..కల్తీ

**-నగరవాసులను వణికిస్తున్న నాసిరకం ఆహారం**

**-బయట ఫుడ్ తినాలంటే జంకుతున్న జనం**

**-మసాలాలు, కారం, పసుపు,అన్ని కల్తీనే**

**-ఫుడ్‌సేఫ్టీ దాడుల్లో బయటపడుతున్న వాస్తవాలు**





**హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త:**

ప్రపంచ వ్యాప్తంగా చారిత్రకంగా, సాంస్కృతింగా ఎంతో గుర్తింపు దక్కించుకున్న హైదరాబాద్ మహానగరం ఆహారం విషయంలో అభాసుపాలవుతుంది. భాగ్యనగరంలో ఆహారకల్తీకి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఇప్పటికే నేషనల్ క్రైం రికార్డు బ్యూరో గణాంకాల ప్రకారం ఆహార కల్తీలో మొదటిస్థానంలో ఉన్న హైదరాబాద్ ఆహార ప్రియకులకు సుచి, శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించలే చెడ్డపేరు తెచ్చుకుంటుంది. ఈపరిస్థితి మార్చేందుకు జిహెచ్ఎంసి, రాష్ట్ర ఆహార భద్రత విభాగం నగరంలో ప్రత్యేక డ్రైవ్ చేపడున్నా ఎక్కడో ఒకదగ్గర నిత్యం కల్తీ ఆహారం కేసులు బయటపడుతూనే ఉన్నాయి.నాసిరకమైన పదార్థాలతో కూడిన రంగులు కలపడం వల్ల చాలాచోట్ల బిర్యానీ కల్తీఅవుతున్నట్లు తనిఖీల్లో బయటపడుతుంది. తందూరి చికెన్ ,చికెన్ 65 లాంటి మాంసాహార వంటకాలకు దూరంగా ఉంటేనే మంచిదని ఆహార భద్రతా విభాగం సూచిస్తుంది. వంట చేసే ప్రాంతాల్లో ఎలాంటి శుభ్రత, పాటించడం లేదని, దుర్గందంతో కూడిన వంట గదులు, అపరిశుభ్రంగా వడ్డించే గిన్నెలు, వాటిపై కుప్పలు కుప్పలుగా బొద్దింకలు పారడం వంటికి టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో బయటపడుతుంది. వండిన ఆహార పదార్థాలను సైతం ఫ్రిజ్‌లలో ఉంచి ఆర్డర్లు వచ్చినప్పుడు వేడిచేసి మసాలాలు కలిపి ఇస్తున్నట్లు తనిఖీల్లోగుర్తించారు.

### మసాలాలు, స్పైసీలు సైతం

మసాలా తయారీ కేంద్రాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. 30కి పైగా మసాలా మాన్యుఫాక్చరింగ్, ప్యాకింగ్ సెంటర్స్‌పై సోదాలు చేశారు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా స్పైసెస్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో చిల్లీ పౌడర్ , పసుపు, మిరియాలు, కరివేపాకు పొడి, ధనియాలు సేకరించి టెస్ట్ కోసం ల్యాబ్‌కి పంపించారు. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని శ్రీవారి స్పైసెస్, బండ్లగూడ జాగీరులోని డివైన్ స్పైసెస్‌లు అపరిశుభ్ర వాతావరణంలో మసాలాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు.మిరియాలు, ఇతర మసాలాల్లో ఎలుక మలం ఉన్నట్లు గుర్తించారు. అవే మసాలాలు ప్యాకింగ్ చేసి షాప్స్‌కి పంపుతున్నట్లు తెలుసుకున్నారు. అలాగే గడువు ముగిసిన,లేబుల్ లేని ప్రొడక్ట్స్ స్టోర్ చేసినట్లు గుర్తించి నిబంధనలు పాటించనిమసాలా తయారీ కేంద్రాలకు నోటీసులు ఇచ్చారు.

### అత్యాశతో...

డబ్బులు ఎక్కువగా సంపాదించాలనే అత్యాశతో కొందరు వ్యాపారులు జనాల అరోగ్యాన్ని పాడుచేస్తున్నారు. హైదరాబాద్ సిటీలో కల్తీ ఆహారం తయారు చేస్తున్న వారిపై అధికారులు ఉదాసీనంగా వ్యవరహిస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. వ్యాపారులు ఇస్తున్న మామూళ్లను తీసుకుని ..నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపు కుంటున్నారని పలువురు నగర వాసులు మండిపడుతున్నారు. ఇక స్ట్రీట్ ఫుడ్, చిన్న చిన్న టిఫిన్ సెంటర్ల లో నాణ్యత పరిశీలించే దిక్కు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాలకోసం ఏనూనెల వాడుతున్నారో .. ఎన్నిసార్లు వేడిచేసిన నూనె ఉపయోగిస్తున్నారో కూడా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల బయట తినేవారు డబ్బులు చెల్లించి మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. ఏవో కొన్ని హోటళ్లు ,రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించడం.. నాసిరకం ఫుడ్, అపరిశుభ్రత, కల్తీ ప్రొడక్ట్ కనిపిస్తే నోటీసులు ఇవ్వడం.నామమాత్రపు ఫైన్ విధించి వదిలేయడం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఆహారం కల్తీచేసే వారికి భయం లేకుండా పోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో "1950" హెల్ప్‌లైన్

**జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు**

**హైదరాబాద్, అక్టోబర్ 14,ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక 1950 హెల్ప్‌లైన్ , జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేశారు.

1950 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు ఓటర్ల జాబితా, పోలింగ్ సెంటర్లు, ఎపిక్ కార్డులు, మోడల్ కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాల అంశాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం పొందడమే కాకుండా, ఫిర్యాదులు నమోదు చే యవచ్చు.1950 హెల్ప్‌లైన్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటి వరకు 433 కాల్స్ రాగా 379 కాల్స్‌కు సమాధానం ఇచ్చారు.

## రెండో రోజు అదే జోరు

**- పది నామినేషన్లు దాఖలు**

**- నేడు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ నామినేషన్**


ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కర్ణన్, చిత్రంలో సాయిరాం ఉన్నారు.

**జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి రెండో రోజైన మంగళవారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు పది నామినేషన్లు వేయగా రెండో రోజు అదే జోరు కొనసాగింది. స్వతంత్రులుగా బింగి రాములు, కాందాడి మణిపాల్‌రెడ్డి, గొంటి శ్రీకాంత్, మూల్య సంజీవులు, పానుగోటు లాలా సింగ్, పబ్బతి శ్రీకృష్ణలు తమ నామినేషన్లు దాఖలు చేశారు. రిజిస్టర్ పార్టీలైన పాట పార్టీ నుంచి మచ్చెర్ల వెంకటరెడ్డి, అన్న వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి మహమ్మద్ మసూర్ అలీ, శ్రమజీవి పార్టీ నుండి జాజుల భాస్కర్, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ నుండి లంటు చంద్రశేఖర్, సోమవారం నామినేషన్ వేసిన వేముల విక్రమ్ రెడ్డి తన రెండో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్లను రిటర్నింగ్ అధికారి పి. సాయిరాంకు అందించారు. అంతకముందు షేక్‌పేట మండల కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్ సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియపై ఆయన అధికారులతో చర్చించారు. మరోవైపు ఇక్కడ ఏర్పాటుచేసిన పోలీసు బందోబస్తును పశ్చిమ మండల డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పరిశీలించారు.

### నేడు మాగంటి సునీతగోపీనాథ్ నామినేషన్

బీఆర్ఎస్ అభ్యర్థిమాగంటి సునీతగోపీనాథ్ ఈ నెల 15(నేడు)న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## వేర్వేరు కేసుల్లో గంజాయి, చాక్లెట్‌లు పట్టివేత

**హైదరాబాద్,అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈఎస్ఐసీ హిల్‌ఫోర్ట్ లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డి తన సిబ్బందనితో కలిసి దాడి చేశారు.ఈ దాడిలో 2.1 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో గంజాయితో పాటు ఒక టూవీలర్‌ను, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని యు. ముఖేష్,యు.మంజులను అరెస్టు చేశారు.దేవరాజ్, దేవ, షేక్ ఖలీద్, అమన్‌లపై కూడ కేసు నమోదు చేశారు.ఆరుగురిలో ఇద్దరు అరెస్టు చేయగా మిగిలిన నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.మరో కేసులో ఎస్‌టిఏఫ్ డీ టీమ్ సిఐ నాగరాజు సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు.రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారం 10పైన అనుమానంగా ఉన్న ఒక సంచిని పరిశీలించగా అందులో 1.600 కేజీల గంజాయి చాక్లెట్స్ ఉన్నట్లు గుర్తించారు. గంజాయి చాక్లెట్లను తీసుకవచ్చిన వ్యక్తి ఎక్సైజ్ పోలీసులను చూసి పరారీ కావడంతో పట్టుకున్న గంజాయి చాక్లెట్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్‌లు

## 18న రవాణ శాఖ స్తంభింపచేస్తాం: వేముల రామకృష్ణ



తెలంగాణ బిసి విద్యార్థి విభాగం నుద్దేశించి మాట్లాడుతున్న విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త

ఈ నెల 18న బిసి జేఏసి ఇచ్చిన రాష్ట్ర బంద్‌తో రవాణ రంగాన్ని పూర్తిగా స్తంభింప చేస్తామని తెలంగాణ బిసి విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. మంగళవారం విద్యార్థి విభాగం నుద్దేశించి ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల హైకోర్టు స్టేట్ తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన విద్యార్థులకు పిలుపు నిచ్చారు. స్వరాష్ట్ర సాధన తరహాలో బీసీ ఉద్యమం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని, విద్యా సంస్థలు తెరవద్దని, బస్సులు నడవద్దని, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ చేయాలి పిలుపు నిచ్చారు. ఈ బంద్‌కు రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంఘాలు బందుకు మద్దతు తెలిపాయని తెలిపారు. బీసీ జేఏసీ చైర్మన్, ఎంపి ఆర్. కృష్ణయ్య జేఏసీ వైస్ చైర్మన్ నారగోని, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో చైర్మన్లు రాజారాం యాదవ్, దాసు సురేష్, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణల సారధ్యంలో బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## పరిశుభ్రతను పాటించని హోటళ్లపై అధికారుల దాడులు

- రూ.28.వేల జరిమానా విధించిన అధికారులు



పరిశుభ్రతను పాటించిన హోటళ్ల యజమానులకు జరిమానాలు విధిస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ అధికారుల దృశ్యం

**నార్సింగి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న హోటళ్లపై మంగళవారం అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఇటీవల హోటళ్లలోని తిను బండారాలలో బొద్దింకలు, పురుగులు రావడంతో పలువురు వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమీషనర్ శరత్‌చంద్ర వెంటనే స్పందించి అధికారులను హోటళ్లలో పరిశుభ్రతను పరిశీలించాలని, అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు చట్ట పరిధిలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. కమీషనర్ ఆదేశాల మేరకు మంగళవారం అధికారుల బృందం కార్పోరేషన్ పరిధిలోని పలు హోటల్లపై దాడులు చేయగా కొన్ని హోటళ్లలో పరిశుభ్రత చక్కగా ఉందని, మరికొన్నింటిలో చెత్త, ఈగలు అక్కడే ఉండి దుర్వాసన రావడంతో ఆయా హోటళ్ల యజమానులకు రూ.28.వేల జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కమీషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ హోటళ్ల యజమానులు విధిగా పరిశుభ్రతను పాటించాలని, తాజా ఆహార పదార్థాలనే వినియోగదారులకు వండిపెట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి హోటళ్ల నడిపినా, అపరిశుభ్రత ఆహార పదార్థాలు వడ్డిస్తున్నట్లు ఎవరైనా వినియోగదారులు ఫిర్యాదు చేసినా తనిఖీలు చేసి, పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తామని, దారికి రాకపోతే హోటళ్లను సీజ్ చేస్తామని కమీషనర్ శరత్‌చంద్ర హెచ్చరించారు.

## లైంగిక దాడులపై విద్యార్థినులకు అవగాహన



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో లైంగిక దాడులపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సోషల్ యాక్షన్ మొబిలైజర్ ప్రతినిధుల దృశ్యం

**నార్సింగి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో సోషల్ యాక్షన్ మొబిలైజర్(ఎస్ఎంఎం) ప్రతినిధుల బృందం మంగళవారం లైంగిక దాడిపై విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఎం ప్రతినిధి శ్రీనివాస్, మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఆడ బిడ్డలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒక్క తల్లి తప్పా తండ్రి, సోదరులు, ఇతర బంధువర్గం, బయటి వ్యక్తులు ఎవరైనా ఒంటిపై చేయి వేసి అసహజంగా ప్రవర్తిస్తే వెంటనే కేకలు వేయాలని సూచించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శలను గుర్తించి వెంటనే అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తుల వివరాలను తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు తెలియపర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలతో జీవితం చిన్నాభిన్నం : ఎస్‌హెచ్‌ఓ బోస్ కిరణ్




అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్న గాంధీనగర్ ఎస్‌హెచ్‌ఓ

**ముషీరాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని గాంధీనగర్ ఎస్‌హెచ్‌ఓ బోస్ కిరణ్ హెచ్చరించారు. మంగళ వారం నగర పోలీస్ కమీషనర్ సజ్జనార్, సెంట్రల్ జోన్ డిసిపీ కే.శిల్పవల్లిల సూచనల మేరకు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడ సత్యమాల్ వద్ద మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై యువతకు అవగాహన కలిగిస్తూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ కిరణ్ మాట్లాడుతూ ఎంతో విలువైన జీవితాన్ని మాదక ద్రవ్యాల వినియోగంతో నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల కలుగుతున్న అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మేకల చోరీపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః

మేకల చోరీపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన మహమ్మద్ ముక్తాదిర్ గత ఆరు నెలలుగా రెండు మేకలను పెంచుతున్నారు. ఏడు నెలల వయసున్న రెండు మేకలు ప్రతి రోజు బయటకు వెళ్లి గడ్డి మేసి అరగంట తరువాత తిరిగి వస్తాయి. ఈ నెల 10న మేకలను రెండు మేత కోసం బయట వదిలిపెట్టాడు. అరగంట తరువాత గమనించగా మేకలు రెండు కనిపించలేదు. దీంతో మేకల యజమాని ముక్తాదిర్ తన మేకల చోరీపై బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేంకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై బైక్ ర్యాలీ

హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త

స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లకు హైకోర్టు స్టే ఇవ్వడాని నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు నిచ్చారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యానగర్ బీసీ భవన్ నుండి ఉస్మానియా యూనివర్సిటీ మీదుగా గన్ పార్క్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్.కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. శాంతియుతంగా బీసీ జేఏసీ అక్టోబర్ 18న తలపెట్టిన బందుకు బీసీ ప్రజలు, నాయకులు పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. నేటి నుండి అక్టోబర్ 18 వరకు బంద్‌కు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలలో బైక్ ర్యాలీలు నిర్వహించి బీసీ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరించి చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ మెడికల్ షాపులు తప్ప అన్ని స్వచ్ఛందంగా బంద్ చేసి బీసీ ఉద్యమంలో పాల్గొనాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు.' రిజర్వేషన్ల కేసులో 30 బీసీ సంఘాలు ఇంప్లీడ్ కేసులు వేశారు. పిటిషనర్ల వాదన కూడా వినకుండా స్టే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇది చాలా అన్యాయం' అన్నారు. ఈ ర్యాలీ లో బిసి సంఘాల ప్రతినిధులు గవ్వల భరత్‌కుమార్, టి.రాజ్‌కుమార్, రాజు నేత, అనంతయ్య, రాజేందర్, మనికంత, పగిళ్ళ సతీష్, ప్రీతం, అరవింద్, నరేష్ గౌడ్, రవికుమార్, రమేష్ యాదవ్, శివ, ఉత్తమ, నిఖిల్, లక్ష్మి ప్రసన్న, రమాదేవి, లత, వంశీ, ప్రసన్న, రాహుల్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గవ్వల భరత్‌కుమార్,టి.రాజ్‌కుమార్ తదితరులు

## విలువలతో కూడిన భవిష్యత్తును అందించాలి : మంత్రి వివేక్ వెంకట స్వామి

**చిక్కడపల్లి అక్టోబర్ 14 (ప్రభాతవార్త):** విలువలతో కూడిన అందించడం ద్వారా విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు సాగేఅవకాశం ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి అన్నారు. మంగళ వారం బాగ్ లింగంపల్లి డా. బి ఆర్ అంబెడ్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు విద్వత లా ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా మంత్రి వివేక్ వెంకట స్వామి రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హాజరై ప్రసంగించారు. లా విద్యార్థులు ప్రతి విషయంలో సమ ధర్మాన్ని పాటించడంతో పాటు న్యాయం వైపు నిలబడాలన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, విద్యాసంస్థల డా సరోజ వివేక్ మాట్లాడుతూ కాకా ఆశయసాధనలో నడిపిస్తున్న తమ విద్యా సంస్థల్లో లా అనేది ప్రాధాన్యత అంశం అని, ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఎటువంటి సమస్యలు, ఇబ్బదులు ఉన్న అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. న్యాయ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు తెచ్చుకోవడం తమ కళాశాలకు పేరు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి లా ఫెస్ట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఎంతో ప్రాధాన్యంతో కుండిన న్యాయ విలువలను నేర్చుకుని పది మందికి పంచాలన్నారు. విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు అందించడానికి తమ విద్యాసంస్థలు ముందుటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా సృజన మాట్లాడుతూ లా ఫెస్ట్ కి సహకరించిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో కళాశాలల సీఈఓ , డైరెక్టర్స్ , టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు




విద్వత లా ఫెస్ట్ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి , చిత్రంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, కరెస్పాండంట్ డాక్టర్ సరోజ వివేక్

## కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం : మాజీ కేంద్ర మంత్రి సి.పి.జోషి

**ముషీరాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఏఐసీసీ నాయకులు మాజీ కేంద్ర మంత్రి సి.పి.జోషి స్పష్టం చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుని ఎంపిక కోసం ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఏ అండ్ బి బ్లాక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుని ఎంపికలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పార్టీని బలోపేతం చేసే వారికి అవకాశం ఇస్తామన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి కష్ట పడి పనిచేసే వారే భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహిస్తారని అన్నారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీకి చేరువయ్యేలా పార్టీ నాయకులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాలంటే క్రింది స్థాయి నుంచి నాయకులు క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నారని, ఆయనకు అండగా మద్దతు కూడగట్టుకునే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుని ఎంపిక కోసం పార్టీ నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. తమ విన్నపాలను వినతి పత్రం రూపంలో స్థానిక నాయకులు అందచేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, సమావేశం కోఆర్డినేటర్ పవన్, ఏ అండ్ బి బ్లాక్ కమిటీ అధ్యక్షులు వి.డి.కృష్ణ, అంజి యాదవ్, యూత్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సంఘపాక వెంకట్, మాజీ కార్పోరేటర్‌లు వాజిద్ హుస్సేన్, కల్పనాయాదవ్, డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పట్నం నాగభూషణంగౌడ్, లింగం గుప్తా, జి.గోవింద్, నర్సింగ్‌రావు, మేడి సురేష్‌కుమార్, లోకేష్‌యాదవ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సిపి జోషి

## నకిలీ, గుర్తింపు లేని పారా మెడికల్ డిగ్రీ కళాశాలల గుర్తింపును రద్దుచేయాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**సైఫాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ, గుర్తింపు లేని పారా మెడికల్ డిగ్రీ కళాశాలలను తక్షణమే మూసి వేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెల్త్ సెక్రటరీకి విజ్ఞప్తి చేస్తామని ఆయన చెప్పారు. అంతర్జాతీయ అనుబంధ ఆరోగ్య నిపుణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ది అనాటమీ ఆఫ్ అవేర్‌నెస్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బోగస్ కళాశాలలు ఏర్పాటు చేసి నకిలీ సర్టిఫికేట్లు ఇస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుని కష్టపడి చదివిన అసలైన విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కోర్సులు పూర్తి చేసిన వారు మానవ సేవే మాధవ సేవగా భావించాలని, మానవతా దృక్పథంతో పేదలైన రోగులకు పారా మెడికల్ ఉద్యోగులు విశేషమైన సేవలు అందించి వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. పారా డిప్లొమో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్స్, గురుకులాలను ఏర్పాటు చేయాలని, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని, ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆనేక పోరాటాలు చేసి విజయం సాధించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కళాశాలల్లో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, కట్టిన డబ్బులు వాపస్ చేయించాలని, పారా మెడికల్ డిగ్రీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని, పారా మెడికల్ డిగ్రీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రశాతంత్‌కుమార్, శివరాం ప్రసాద్, ప్రో గ్రాం కో-ఆర్డినేటర్ డా.రజని, ఎం.రాము, వెంకటేష్, పగిళ్ళ సతీష్, నిఖిల్ పటేల్, రవియాదవ్, చిక్కుడు బాలయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పారా మెడికల్ డిగ్రీ కళాశాలల విద్యార్థులతో ఆర్.కృష్ణయ్య

## రోడ్డు సౌకర్యం కావాలని రోడ్డెక్కిన పాపిరెడ్డినగర్‌కాలనీ వాసులు

శేరిలింగంపల్లి,అక్టోబర్ 14 ప్రభాతవార్త

అరవైవేలమందికి పైగా నివాస ముండే ఆ కాలనీలో రోడ్డుసదుపాయం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ ప్లాట్ యజమాని రోడ్డును కబ్జాచేసి ప్రహారీగోడను నిర్మించటంతో కబ్జాకు గురైన రోడ్డును కబ్జాచెరనుంచి కాపాడాలని కాలనీ వాసులు రోడ్డెక్కారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం నిరసనకు దిగారు. ప్లాట్‌నంబర్ 1827 ఎదుట కాలనీవాసలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాపిరెడ్డినగర్‌కాలనీలో ప్రస్తుతం 50వేల నుంచి 60వేల వరకు ప్రజలు నివసిస్తున్నారని, మౌళిక సదుపాయాలలో భాగంగా కాలనీ వాసులకు సక్రమంగా రోడ్డు వసతి లేకపోవడంతో వాహనదారులకు, పాఠశాలలకు వెళ్లేందుకు స్కూల్ బస్సులకు, ఎమర్జెన్సీ తరుణంలో అంబులెన్సులు రావటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయమై పలుమార్లు జీహెచ్ఎంసీ అదికారులతో విన్నవించినా ఫలితంలేకుండా పోయిందని వాపోయారు. ముఖ్యంగా ప్లాట్‌నంబర్ 1827 వారు రోడ్డును కబ్జాచేసి ప్రహారీగోడను నిర్మించి రోడ్డు నిర్మానానికి అంతరాయాన్ని కల్పిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యపై 2020లో పలుమార్లు సంబందిత అధికారులకు కూడా వినతిపత్రాలను సమర్పించటం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారే కాని ఫలితం కనిపించలేదన్నారు. ఈసమస్యపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు విన్నవించుకోవడం కూడా జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్‌సీ రెడ్డి,బసవరాజు, కుమా ర్, శ్రీనివాస్, స్థానిక మహిళలు,కాలనీవాసులు, పాల్గొన్నారు.



రోడ్డుకబ్జాను అరికట్టి రోడ్డేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

## ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయకరణ చేయాలి : బిఎస్ రాంబాబు

హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త

దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ సంపద, ప్రజాధనం పరిరక్షణ కోసం ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయకరణ చేయాలని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఈఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ (ఎఐబిఈఎ) ఇచ్చిన పిలుపు మేరకు ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు హైదరాబాద్, గన్‌ఫౌండ్రి, చిరాగ్అలీ లైన్, కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ కార్యాలయం వద్ద సామూహిక ప్రదర్శన నిర్వహించారు. బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులు, వ్యక్తుల చేతులకు అప్పగిస్తూ వేల కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలని, ఆ బ్యాంకులలో అవసరమైన మేరకు రెగ్యులర్ క్లరికల్, సబ్ స్టాఫ్ కేడర్ నియమించాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకులో ఉద్యోగులపై వేధింపులను ఆపాలని, సిఎస్‌బి సాధ్యమైనంత తొందరగా వేతన సవరణ చేయాలని, అన్ని ప్రైవేటు బ్యాంకులలోని పెన్షనర్లకు ఎక్స్‌గ్రేసియా వర్తింపజేయాలని, నైనిటాల్ బ్యాంక్ విక్రయాన్ని వెంటనే నిలుపుదల చేసి, దానిని బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)ను కోరారు. ప్రదర్శనలో ఎపి టీఎస్ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్, కార్యదర్శులు శైలేంద్ర, వినోద్, నల్లపురెడ్డి, ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ ప్రధాన కార్యదర్శి మధుసుదన్, కరూర్ వైశ్యా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి శంకర్, ఫెడరల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్నాటక బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.



ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు సామూహిక ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, చిత్రంలో బిఎస్ రాంబాబు తదితరులు

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి

చార్మినార్, అక్టోబరు 14 ప్రభాతవార్త :



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి

హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం అలీజాకోట్ల ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి మంగళవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్‌లో చేరిన అలీ మస్కతి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీసెక్యూలర్ పార్టీ అని,కేసిఆర్ పాలనలో మైనార్టీలకు ఎన్నో పథకాలు లభించాయని తెలిపారు.పాతబస్తీ అలీజాకోట్లకు చెందిన అలీ మస్కతి టిడిపి తరుపున చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.దాదాపు ఇరవై రెండు సంవత్సరాలు పాటు టిడిపిలో కొనసాగిన అలీ మస్కతి పలు పదవులలో కొనసాగారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలీ మస్కతి టిడిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.దాదాపు రెండు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్న అలీ మస్కతి మంగళవారం బిఆర్ఎస్‌లో పార్టీలో చేరారు.బిఆర్ఎస్ తీర్థం పుచుకున్న అలీ మస్కతిని చార్మినార్‌తో పాటు పాతబస్తీకి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

## చిరస్మరణీయుడు ఆచార్య ఎస్వీ రామారావ్



ఆచార్య ఎస్.వి.రామారావుకు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న శివారెడ్డి, చెన్నయ్య, గౌరీశంకర్, మనోహర్‌బాబు, నాళేశ్వరంశంకరం, రామమూర్తి తదితర ప్రముఖులు

నాంపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త :

తెలుగు సాహిత్య విమర్శ, వికాసం కోసం అహర్నిశలు పాటుపడుతూ జీవితాన్నే ధారపోసిన ఆచార్య ఎస్వీ రామారావు చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పరిషత్తులో డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో ప్రముఖ విమర్శకుడు, పరిశోధకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఎస్.వి.రామారావు సంస్మరణ సభ పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. పెద్దసంఖ్యలో హాజరైన కవి పండితులు రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య సభకు స్వాగతం పలికి ప్రారంభించారు. అధ్యక్షోపన్యాసంలో శివారెడ్డి డా. సినారె పరిశోధన గ్రంథం తర్వాత ఆచార్య ఎస్వీరామారావు పరిశోధనా గ్రంథం గౌరవాన్ని పొందిందన్నారు. సాహిత్య విమర్శ పరిశోధన, బోధన కోసం జీవిత పర్యంతం కృషిచేశారని శివారెడ్డి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఎస్వీరామారావు తెలుగు సాహిత్య విమర్శ రంగాన్ని సుసంపన్నం చేశారని, ఆయన తన గురువని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ సంస్మరణ సభలో ఆచార్య టి.గౌరీశంకర్, గిరిజా మనోహర్‌బాబు, డా. తూర్పు మల్లారెడ్డి, డా. కాంచనపల్లి, డా. నాళేశ్వరం శంకరం, డా. ఫణీంద్ర, కె.మురళి, రింగురామమూర్తి, ఎం.దత్తాత్రేయశర్మ తదితరులు పాల్గొని రామారావుకు శ్రద్ధాంజలి ఘటించారు. రామారావు సతీమణి స్వయం ప్రభ, కుమారుడు సాయిగిరిధర్ కూడా పాల్గొన్నారు.

## ఘనంగా బౌద్ధ దమ్మ దీక్షా మహోత్సవాలు




అంబేద్కర్ విగ్రహం ఎదుట మాట్లాడుతున్న వడ్డమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ లక్షలాది మంది తన అనుచరులతో బ్రాహ్మణ హిందూ మతాన్ని విడిచి బౌద్ధ ధర్మంను 1956, అక్టోబరు 14వ తేదీన నాగపూర్‌లోని దీక్ష మైదాన్‌లో స్వీకరించి తాత్విక పరివర్తన చెందడం జరిగిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. కుల, వర్ణ వ్యవస్థలను సమర్థించే మనువాద అసమానతలు, కుల వివక్ష, అణిచివేతల హైందవ మాఫియా మతంలో దళిత బహుజన సమాజానికి తాత్విక విముక్తి ఉండదని ఆయన హెచ్చరించారు. పార్టీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం జరిగిన బౌద్ధ ధమ్మ దీక్షా మహోత్సవాలను పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం, కరుణ ప్రేమ, సౌభ్రాతృత్వం పునాదిగా గల మానవీయా ధర్మం బౌద్ధని మార్గంలో దేశంలోని పీడిత సమాజం అంతా బౌద్ధ తాత్విక మార్గంను అచరించడం ద్వారానే తాత్వికం వస్తుందన్నారు. విముక్తికోసం అంబేద్కర్ చూపిన మార్గాన్ని అచరించాలని ఆయన సూచించారు. తొలుత ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జెఎన్ రావు, సంకు శ్రీనివాసులు, ఇటికాల గణేష్ తదతరులు పాల్గొన్నారు.

## మూసీనదిలో మునిగి యువకుడు మృతి

**చార్మినార్,అక్టోబరు 14 ప్రభాతవార్త :** తాగిన మైకంలో మూసీనదిలో ఈత కొట్టడానికి వెళ్లిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.... పాత బస్తీ ఉస్మాన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫర్హాన్ (25) ప్రైవేట్ ఉద్యోగి.ఫర్హాన్ మంగళవారం అతని స్నేహితులైన హుస్సేన్,అక్రమ్‌తో కలిసి మూసినది వద్ద మద్యం సేవించారు.మద్యం మత్తులో ఉన్న మమ్మద్ ఫర్హాన్‌మూసీనదిలో ఈత కొట్టడానికి వెళ్లాడు.ఇద్దరు స్నేహితులు చెప్పిన మహ్మద్ ఫర్హాన్ వినలేదు.ఈతకు వెళ్లిన మహ్మద్ ఫర్హాన్ మద్యం మత్తులో మూసీనదిలో పడి మృతి చెందాడు.సమాచారం అందుకున్న కామాటిపుర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం కోసం ఉస్మానియా మార్చురికి తరలించారు.పోస్టు మార్టం అనంతరం బంధువులకు మహ్మద్ పర్హాన్ మృత దేహాన్ని అప్పగించారు.ఈ కేసును కామాటిపుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్కకి.. చెల్లెలు వీడియో పంపి బెదిరింపులు

- మధురానగర్ ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః

అక్కకు చెల్లెలు అసభ్య వీడియో పంపి బెదిరింపులకు పాల్పడిన ఒకరిపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా ప్రాంతానికి చెందిన ఒక యువతి(28) ఒక బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తుంది. ఆమె సోదరి కొంత కాలంగా షేక్ ముబీన్ అనే వ్యక్తిని ప్రేమించింది. కుటుంబ సభ్యులు అంగీకరించకపోయినా వివాహం చేసుకోవడానికి తరువాత అంగీకరించారు. అనంతరం ముబీన్ తరుచూ యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు దిగాడు. గత ఆరు సంవత్సరాలుగా వారి కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలోనే యువతికి, ముబిన్‌కు మధ్య విభేదాలు తలెత్తడంతో యువతి దూరంగా ఉండాలని నిర్ణయించుకొంది. దీంతో ముబీన్ 'నిన్ను చంపేస్తా'నంటూ ఆమెను బెదిరించాడు. తాజాగా 12న ముబీన్ తాను ప్రేమించిన యువతి సోదరికి అసభ్యకరమైన వీడియో పంపి 'ఇది నీ చెల్లెలు వీడియో.. ఇలాంటి వీడియోలు నా వద్ద చాలా ఉన్నాయి' అంటూ బెదిరించాడు. యువతి సోదరి ఫిర్యాదు మేరకు మదురానగర్ పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని కార్మికుడు ఆత్మహత్య

జీడిమెట్ల, అక్టోబర్ 14, ప్రభాతవార్త

రాజీవ్ గాంధీ నగర్‌లోని కన్స్ట్రక్షన్ సంస్థలో గతంలో హెల్పర్‌గా పనిచేసిన ఓ కార్మికుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటకి చెందిన నర్సారెడ్డి నారాయణరెడ్డి (44) కుటుంబంతో నగరానికి వలస వచ్చి, ఓ ప్రైవేటు కన్స్ట్రక్షన్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తుండేవాడు. మద్యానికి బానిసవడంతో కుటుంబంలో తగాదాలు తలెత్తాయి. దీంతో భార్య లలిత గత కొంతకాలంగా అతనికి దూరంగా ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నెల రోజుల క్రితం కంపెనీ యాజమాన్యం అతన్ని విధుల్లో నుంచి తొలగించింది. భార్యాపిల్లల ఎడబాటుతోపాటు, కంపెనీ యాజమాన్యం విధుల్లో నుంచి తొలగించడంతో జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త ఆత్మహత్యకు కారణం తెలపాలంటూ మృతుడి కుటుంబసభ్యులు సంస్థ ముందు ఆందోళన చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉప్పల్‌లో పార్కు చేసిన ఆర్టీసీ బస్సులలో చోరీ

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద పార్కు చేసిన రెండు ఆర్టీసీ బస్సులలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు, రాజధాని బస్సులు సోమవారం రాత్రి నైట్ హాల్ట్ కోసం ఉప్పల్ చౌరస్తాకు వచ్చి పార్కు చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు బస్సులోకి ప్రవేశించి డ్రైవ రక్లు సంబంధించిన నగదు, బ్యాగ్, సెల్ ఫోన్, తదితర వస్తువులను చోరీ చేసినట్లు తెలిపారు. సూపర్ లక్సరీ బస్సు డ్రైవర్ యాకయ్యకు చెందిన బ్యాగ్, ఫోన్, పర్సులో ఉన్న ఐదు వేల నగదు,ఐడీ కార్డు, డిపో ఎస్ఆర్ లార్డ్ షీట్ తదితర వస్తువులతోపాటు, రాజధాని బస్సు తాళం దొంగతనం చేసినట్లు డ్రైవర్ రాజు తెలిపారు. మంగళవారం ఇద్దరు ఆర్టీసి డ్రైవర్లు ఉప్ప ల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 16 మంది యువకులకు రెండు రోజుల జైలు శిక్ష

చార్మినార్,అక్టోబరు 14 ప్రభాతవార్త :

గొడవకు దిగిన 16 మంది యువకులకు కోర్టు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించిందని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.ముర్గీచౌక్ ప్రాంతంలో బిహార్‌కు చెందిన 16 మంది యువకులు వాళ్ల లో వాళ్లు గొడవ పడ్డారు.ఒకరిని ఒకరూ గాయ పరుచుకున్నారు.వారిపై కేసు నమోదు చేసి పోలీసులు ప్రత్యేక రెండవ తరగతి ప్రత్యేక న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టగా ప్రత్యేక రెండవ తరగతి ప్రత్యేక న్యాయమూర్తి ఎం.స్వామి 16 మంది యువకులకు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఆయన తెలియజేశారు.

## 26న హమాలీ బస్తీలో బొడ్రాయి పండుగ


ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న హమాలీ బస్తీ పెద్దలు

**కంటోన్మెంట్,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఈ నెల 26న పద్మారావు నగర్‌లోని హమాలీ బస్తీలో బొడ్రాయి పండుగ నిర్వహించనున్నట్లు, ఈ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ హమాలీ బస్తీ పెద్దలు పద్మారావు నగర్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మారేడ్‌పల్లిల్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ బస్తీ నాయకులు సంపత్, కుషాల్, సత్య నారాయణ, నర్సింగ్, కాంతారావు, దుర్గా, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి : ఆదం సంతోష్


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆదం సంతోష్ తదితరులు

**అడ్డగుట్ట,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై కాంగ్రెస్ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలందర్‌రెడ్డి, గంట రాజు సాగర్, దాండియా సందీప్, శిల్పా చారి, గుంటి క్రిష్ణ, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

## జయహో జలాది వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు


ప్రారంభోత్సవంలో పాల్గొన్న రిటైర్డ్ అధికారులు, వ్యవస్థాపకులు రత్న సుధీర్

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** జయహో జలాది యూత్ సేవా సంస్థ అమీర్‌పేటలోని జిజ్ఞాస స్టూడియోలో యువతి, యువకులకు,విద్యార్థులకు, నిరుద్యోగులకు కెరీర్ గైడెన్స్, శిక్షణా కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ ఎస్. చెల్లప్పా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినకర్ బాబులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయహో జలాది వెబ్ సైట్‌లో యువతీ,యువకులు, నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేయించుకోవడం ద్వారా ఉచితంగా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సంస్థ వ్యవస్థాపకులు జలాది రత్న సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ్ నవీన్, వి.వి.ఎన్.దిలీప్,తుమ్మలపల్లి రవి చంద్ర,శ్రీనివాస్, నిరుద్యోగ యువతీ,యువకులు పాల్గొన్నారు.

## బిసి సంఘాల బంద్‌కు తెలుగుదేశం మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్‌గౌడ్

**ముషీరాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త:** ఈనెల 18వ తేదీ బీసీ సంఘాల ఐక్యవేదిక జేఏసీ నిర్వహించ తలపెట్టిన బంద్‌కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నామని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని తెలుగుదేశం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రధాన లక్ష్యం బలహీన వర్గాల సంక్షేమేనని గుర్తు చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలను చైతన్య పరుస్తూ రాజ్యాధికారం కల్పించే దిశగా కృషి చేస్తూనే ఉంటారని అన్నారు. కాంగ్రెస్‌కు నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించి, నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీసీలను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీసీలు దేశానికే వెన్నుముక వంటి వారని గుర్తించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, బలహీన వర్గాలకు సమాజంలో సమున్నత స్థానం కల్పించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీ తెలుగుదేశం ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, శుక్రవేది, యాదగిరి పాల్గొన్నారు.

## సిఈఓ మధుకర్ నాయక్ సేవలు ఎనలేనివి: మహేశ్వర్‌రెడ్డి


కంటోన్మెంట్ సిఈఓ మధుకర్ నాయక్‌ను అభినందిస్తున్న మాజీ బోర్డు మెంబర్లు మహేశ్వర్‌రెడ్డి, పాండు యాదవ్, లోకనాథం తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు సిఈఓగా పనిచేస్తున్న మధుకర్ నాయక్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలను కంటోన్మెంట్‌లో చిరస్థాయిగా నిలుస్తాయని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బోర్డు సిఈఓగా మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మధుకర్ నాయక్ పదోన్నతిపై ఢిల్లీ కంటోన్మెంట్ డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ అవుతున్న సందర్భంగా మంగళవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో రక్షణ శాఖ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించి రూ.303 కోట్ల నిధిని కంటోన్మెంట్ బోర్డుకు ఖర్చుపెట్టే విధంగా ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో ఆయన ఎంతో కీతక పాత్ర పోషించారన్నారు. అదే విధంగా నూతన బిల్డింగ్ బైలాస్ అమలు, పికెట్ గార్డెన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అదే విధంగా స్వచ్ఛతాహి,పరసరాల పరిశుభ్రతలో మొదటి స్థానంలో నిలిచి దేశంలో బెస్ట్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అవార్డు దక్కడంలో సిఈఓ మధుకర్ నాయక్ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్లు పాడు యాదవ్, లోకనాథం, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, బిఆర్ఎస్ నాయకులు చొల్లేటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి

## బిక్కు,బిక్కుమంటూ జీవనం


ప్రమాదస్థితికి చేరుకున్న హరిజన అభ్యుధయ బస్తీలోని క్వార్టర్స్

**గోషామహల్,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** కూలడానికి సిద్దంగా బల్దియా క్వార్టర్స్‌లోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్న క్వార్టర్స వాసులు అవి బూత్ బంగ్లాలా లేక బల్దియా క్వార్టర్స్ అని ప్రతి ఒక్కరని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. నిజానికి అవి బల్దియా క్వార్టర్సే పూర్తిగా పెచ్చులూడి,విరిగి పోయిన గోడలతో ఏక్షణానైనా కూలిపోయే ప్రమాదముంది.ఇది ఎక్కడా కాదు పాత నగరంలోని చార్మినార్ నియోజక వర్గంలోని పురానా పూల్ డివిజన్ పరిధిలోని స్వామి వివేకనందనగర్ హరిజన అభ్యుదయ సంఘంబస్తీలోని బల్దియా క్వార్ట ర్స్‌ల దుస్థితి. బల్దియా క్వార్టర్స్ వాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్వార్టర్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. కనీస సౌకర్యాలు లేక అందులో జీవించే వారు సతమతమవుతున్నారు. శిధిలా వ్యవస్థకు చేరుకున్న క్వార్టర్స్‌లను కూల్చి వాటి స్దానంలో నూతన క్వార్టర్స్‌ను నిర్మించాలని ప్రజలు కోరు తున్నారు.ఇటివల కురిసిన భారీ వర్షాలకు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కు,బిక్కుమంటూ కాలం వెళ్లాతీశారు.1965 సంవత్సరంలో నిర్మించిన క్వార్టర్స్‌ను ప్రహారీగోడలు, రైలింగ్ కూలి పోతున్నాయి.దీ ంతో క్వార్టర్స్ వాసులు ముఖ్యంగా చిన్నపిల్లలు తరుచగా రోగాలకు గురవుతున్నా మని ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.ఈ క్వార్టర్స్ చీకటి పడిందంటే ఒక బూత్‌బంగ్లాలను తలపిస్తుంది.ఇలాగే చూస్తూ ఊరుకుంటే పరిస్దితి విషమించే ప్రమాదముందని స్దానిక ప్రజలు, మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటివల హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, బహుదూర్‌పురా మండల రెవె న్యూ అధికారులతో కలిసి హౌజింగ్ బోర్డు,అధికారులు పురానా పూల్ స్వామివివేకనందనగర్, హరిజనబస్తీ మురికి వాడలను పరిశీలించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం తగ్గిన చర్యలు తీసుకుని ఈ మురికి వాడలలో కొత్త ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. 1985 సంవత్సరంలో దివంగత నేత,ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ హాయంలో నిర్మిం చిన క్వార్టర్స్ కూడా ప్రమాదస్థితిలో మారినట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. పెరుగుతున్న జనాభాఅనుగుణంగా కొత్తగా డబుల్ బెడ్ రూమ్ నిర్మించి ఇవ్వాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి విన్నవించారు.కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్ కూడా వినతి పత్రం సమర్పించారు. రేలింగ్ తోపా టు,కూలిపోవడం తోపాటు పెచ్చులూడిపోయాయని స్థానిక ప్రజలు వాపోయారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించిన స్వామివివేకనంద నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ లు నిర్మించే విధంగా ఆదేశాలుజారీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## వర్షం నీరు సాఫీగా వెళ్లేలా పనులు


వరద నీరు వెళ్లేందుకు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా

**గన్‌ఫౌండ్రి,అక్టోబర్ 14ప్రభాతవార్త:** పెరుగుతున్న జనాభా అనుగుణంగా పైపు లైన్ పనులను ఆధునీకరించడం జరుగుతుందని,దీనికి తోడు భారీ వర్షాలు కురిసిన సమయంలో సాఫీగా వెళ్లేందుకు ప్రత్యేక పనులను చేపట్టడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా అన్నారు.ఈమేరకు డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో సుధీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీసమస్య పరిష్కరించేందుకుగాను ఈ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.నేతాజీ నగర్‌లో అభివృద్ధి పనులను డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా పనులను ప్రారంభించారు.ఈ పనులు పూర్తిమున్ముందు ఎలాంటి డ్రైనేజీ సమస్యకాని,వరద నీటి సమస్య ఉత్పన్నమనం కాదన్నారు.కార్యక్రమంలో తెలంగాణ బిజెపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్‌బిస్వా పాల్గొన్నారు.

## టపాసు విక్రయాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి


.నగర పోలీసు కమీషనర్ సజ్జనార్ కలిసిన బొకె అందచేస్తున్న సిఐ కె. నర్సింహా

**బేగంబజార్,అక్టోబర్ 14ప్రభాతవార్త:** ఇటివల నగర పోలీసు కమీషనర్‌గా పదవి భాధ్యతలు చేపట్టిన సజ్జనార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిఇ బొకె అందచేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బాణా సంచా అమ్మకాలు చేసే దుకాణాదారులు పోలీసులు సూచించే నియమ,నిబంధనలను పాటించాలని,పోలీసుల అనుమతి తీసుకోవాలని సుల్తాన్‌బజార్ ఇన్స్పెక్టర్ కె.నరసింహ అన్నారు.ఆయన మాట్లాడుతూ బాణా సంచా విక్రయాల నేపథ్యంలో టపాసులు విక్రయాలు చేసే దుకాణాదారులు అగ్నిప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలనన్నారు.అనుకోకుండా ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే మంటలను ఆర్పివేసేందుకుగాను, అవసరమైన ఫైర్‌సేఫ్టీ పరికరాలు,రెండు డ్రమ్ములలో నీళ్లు,ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.అనుమతి మేరకు దుకాణాలలో టపాసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.పోలీసులు,ఫైర్ విభాగం నుంచి కూడా అనుమతులు లేకుండా అమ్మకాలు చేస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.

## గౌతమ్ రావును సత్కరించిన బిజెపి నేత శ్యాంసుందర్


బిజెపి రాష్ట్ర జిఎస్.గౌతమ్ రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మద్దెల్ల శ్యామ్ సుందర్

**అడ్డగుట్ట,అక్టోబర్ 14 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్.గౌతమ్ రావు నియమితులైన సందర్భంగా సికింద్రాబాద్ మహంకాలి జిల్లా కార్యదర్శి మద్దెల శ్యాంసుందర్ శాలువకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## లిడ్‌క్యాప్ భూములను ప్రభుత్వం కాపాడాలి

**సైఫాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా లిడ్‌క్యాప్‌కు సంబంధించిన వందలాది ఎకరాల భూములను ప్రభుత్వం కాపాడాలని, వృత్తిదారులకు న్యాయం చేయాలని తెలంగాణ లిడ్‌క్యాప్ మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ సి.కాసీం, అధ్యక్షుడు డా.ఆరేపల్లి రాజేందర్, సలహాదారు వీరాస్వామి మాట్లాడుతూ లిడ్‌క్యాప్ స్థలంలో ప్రభుత్వం మూడున్నర ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు పెట్రోల్ బంక్ నిర్మాణానికి లీజ్‌కు ఇచ్చిందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చర్మ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తగినంత బడ్జెట్ కేటాయించాలని, లిడ్‌క్యాప్ బోర్డును పునరుద్దరించాలని, గత 12 సంవత్సరాలుగా లిడ్‌క్యాప్‌ను అభివృద్ధి చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న శ్రీనివాస్‌నాయక్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని వారు కోరారు. ప్రభుత్వం తక్షణమ తగు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## ఉత్తమ గ్రంథాలకు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాలు

**నాంపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త :** తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2023 సంవత్సరానికిగాను సాహితీ పురస్కారాలను ప్రకటించింది. పద్యకవితా ప్రక్రియలో నరహరిశర్మ, వచన కవితా ప్రక్రియలో విశ్వర్షి వాసిలి, గేయ కవితలో డా. ఏనుగు నరసింహారెడ్డి, బాలసాహిత్యంలో డా. ఎం.హరికిషన్, కథానికా ప్రక్రియలో డా. టి.సంపత్‌కుమార్, నవలా ప్రక్రియలో ఆచార్య పి.సుబ్బాచారి, సాహిత్య విమర్శలో ఆడెపు లక్ష్మీపతి, నాటకం/నాటికల్లో రావుల పుల్లాచారి, అనువాద సాహిత్యంలో డా. టి.సి.వసంత, వచన రచనల విభాగంలో ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, ఉత్తమ గ్రంథం విభాగంలో డా. జంధ్యాల కనకదుర్గ సాహితీ పురస్కారాలకు ఎంపికయ్యారని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. ఈ నెల 29న విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి 20,116 రూపాయల నగుదు అందజేసి ఘనంగా సత్కరిస్తామని వివరించారు. సాధారణ పాఠకుల నుండి, కవులు, రచయితలు, విమర్శకులు, నాటకకర్తల నుండి సూచనలు స్వీకరించి 2020, 2021, 2022 సంవత్సరాల్లో వెలువడ్డ పుస్తకాలను సేకరించి న్యాయనిర్ణేతలచేత వివిధ దశల్లో పురస్కారాల ఎంపికను నిర్వహించడం జరిగిందని నిత్యానందరావు వివరించారు.

## 18న జరిగే బిసిల రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు

**ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డా. శ్రీనివాస్**


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గుండ్లపల్లి శ్రీనివాస్, అల్లుడు జగన్ ముదిరాజ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త:** స్థానికల సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించిన జీవో9ను వ్యతిరేకిస్తూ చేస్తున్న కార్యక్రమాలను ఖండిస్తు బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18న రాష్ట్రబంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డా.గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అల్లుడు జగన్ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు సంబంధించిన జీవో9ని ఐక్యవేదిక స్వాగతిస్తుందన్నారు. అంతేకాకుండా పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టి రాజ్యాంగ సవరన ద్వారా దీన్ని 9వషెడ్యూల్‌లో చేర్చాలని అప్పటివరకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ద్వారా 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అంతేకాకుండా బిసి జేఏసీ ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్యను నియమించడాన్ని స్వాగిస్తున్నామని అలాగే ఆజేఏసీ ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ముందుగ బాలు ముదిరాజ్, బొల్ల వెంకట్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, అంబర్‌పేట్ సతీష్ ముదిరాజ్, దమ్మిగారి కనకయ్య, కటికల బిక్షపతి, పిట్టల పరుశురాం, మల్లబోయిన సురేష్ పాల్గొన్నారు.

# పార్టీకి అంకితభావంతో పనిచేసే నాయకునికి జిల్లా అధ్యక్ష పదవి

**-ఏఐసిసి అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్**


సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

పార్టీ పట్ల అంకితభావం ప్రజాసేవా దృక్పథం ప్రజాదరణ ఉన్న వ్యక్తినే కార్యకర్తల అభిప్రాయ సేకరణ అనంతరమే జిల్లా అధ్యక్షుడిని నియమించడం జరుగుతుందని ఏఐసీసీ అబ్జర్వర్ అంజలి నిమ్బల్కర్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపికపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ కోసం ఆమె మంగళవారం మూసాపేట కైతలాపూర్ రోడ్‌లోని లియో ఫంక్షన్ హాల్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంచార్జ్ బండి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ అధికారం, పదవుల కోసం కాక పార్టీ పట్ల నిబద్ధత సీనియారిటీ సిన్సియారిటీ ప్రజల్లో ఆదరణ ఉన్న నాయకులను మాత్రమే పార్టీ తగిన రీతిలో గౌరవిస్తుందని అన్నారు. ఇతర పార్టీల మాదిరి అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులను నియామకం కాకుండా కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా అధ్యక్షుడు నియామకం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ సూచన మేరకు దేశవ్యాప్తంగా ఇదే తరహాలో జిల్లా, నియోజకవర్గ, మండ్లల, గ్రామ, బూత్ స్థాయి వరకు పార్టీ పదవులను కేటాయించడం జరుగుతుందన్నారు. సమావేశం అనంతరం ఆమె కార్యకర్తలతో వ్యక్తిగతంగా కలిసి అభిప్రాయ సేకరణ చేశారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ ప్రజాధరణ ఉన్నంతకాలం కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎవరు ఏమి చేయలేరనీ అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, టిపిసిసి కార్యదర్శి గాలి బాలాజీ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, తూము వినయ్ కుమార్, జిహెచ్ఎంసి ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కర్క పెంటయ్య, సంజీవరావు, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్ డిసి శ్రీనివాస్ రెడ్డిపై కాలనీ వాసులు ఆగ్రహం


సమావేశంలో కాలనీ వాసులు

**అల్వాల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:**

పార్కు స్థలం విషయంలో డిసి ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా నివేదిక ఇవ్వడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ సాయిబాబా కాలనీ వాసులు మీడియా సమావేశం నిర్వహించి డిసి శ్రీనివాస్ రెడ్డి వ్యవహార శైలి సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీకి చెందిన పార్కు స్థలం అన్యాక్రాంతం అవుతోందని హైడ్రా కమీషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. హైడ్రా కమీషనర్ ఆదేశాలు ప్రకారం 22 జనవరి 2025 రోజున డిసి శ్రీనివాస్ రెడ్డి పార్కును సందర్శించి పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయించారని తెలిపారు. మరునాడే పల్లా రాహుల్, పల్లా విశ్వేర రావులు భూమి తమదని కాలనీకి ఎటువంటి సంబందం లేదంటూ హైకోర్టును ఆశ్రయించగా నాలుగు వారాలు స్టే లభించిందన్నారు. ఇట్టి స్థలంపై పూర్తి నివేదిక అందించాలని డిసిని న్యాయమూర్తి అదేశించారని వివరించారు. అనంతరం తాము వెళ్ళి డిసి కలవగా పార్కు కాలనీకి చెందినదే అని ఎటువంటి ఆందోళన అవసరం లేదని తెలిపారన్నారు. రెండు రోజులుకే కాలనీ వాసులు పేర్కొంటున్న పార్కు స్థలానికి సంబంధించి జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎలో ఎటువంటి రికార్డులు లేవని, పల్లా రాహుల్, పల్లా విశ్వేరరావుల కుటుంబం చేసిన లేవుట్‌లో స్థలం వారిదే అని మార్క్ చేసి ఉన్నందున వారికే చెందుతుందని జోనల్ కమీషనర్‌కు డిసి నివేదిక ఇచ్చారని తెలిపారు. కాలనీ అసోసియేషన్ తరుపున ఆర్టీఐ ద్వారా లే అవుట్ అనుమతి పత్రం ఇవ్వమని కోరాగా జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎలో లేఅవుట్‌కు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవని సమాధానం ఇచ్చారన్నారు. పార్కుకు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవన్న డిసి శ్రీనివాస్ రెడ్డి స్థలం పల్లా రాహుల్, పల్లా విశ్వేరరావులదే అని జడ్‌సికి ఏ విధంగా నివేదిక అందించారని వారు ప్రశ్నించారు. డిసిని కలవడానికి పలుమార్లు ప్రయత్నాలు చేసిన ఆయన సమయం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి డిసి అన్యాయం చేస్తున్నారని ప్రభుత్వ ఆస్తిని కాపాడక పోగా ప్రైవేటు వ్యక్తులకు పత్తాను పలకడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. న్యాయ పరంగానే ముందుకు వెళతామని పార్కు స్థలాన్ని రక్షించుకుంటామన్నారు.

## శబరికి పాదయాత్రగా వెళ్లిన స్వాములు


నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి గ్రామం నుంచి శబరిమలై వరకు పాదయాత్రగా బయలు దేరి వెళ్తున్న అయ్యప్ప స్వాముల దృశ్యం.

**నార్సింగి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామం నుంచి మంగళవారం ఆరుగురు అయ్యప్ప స్వాములు పాదయాత్రగా కలియుగ ప్రత్యక్ష దైవమైన అయ్యప్ప క్షేత్రం శబరి మలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అయ్యప్ప మాలదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆలపించిన "ఓం శ్రీ స్వామియే.... శరణం అయ్యప్ప..." నినాదం గ్రామమంతా మారుమ్రోగిపోయింది. ప్రపంచను అరచేతిలోని చరవాణీలో చూసే నేటి ఆధునిక యుగంలో సైతం ఆధ్యాత్మికతపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లకపోవడం గొప్ప విషయం. ఏటేటా అయ్యప్ప స్వాముల సంఖ్య లక్షలలో పెరుగుతుండడం శుభపరిణామం. అయ్యప్ప స్వామి మాల ధరించడం వెనుకాల ఆరోగ్య రహస్యం ఉందని వయోజనులు పేర్కొంటున్నారు. చన్నీటి స్నానం చేయడం, చెప్పులు లేకుండా నడువడం, కటిక నేలపై పవళించడం, అనుక్షణం అయ్యప్ప నామ జపాన్ని స్మరించడం ఇవన్నీ మనలను ప్రకృతిసిద్దంగా జీవించేలా చేస్తున్నాయన్నారు. ప్రకృతి సిద్దంగా జీవిస్తున్న ఏ ప్రాణులకు అనారోగ్యం, ఆందోళన, ఆవేశం, అనర్థం జరుగడం లేదని గుర్తు చేస్తున్నారు. ఆధునికతకు బదులుగా ప్రకృతిసిద్దంగా జీవిస్తేనే ఆరోగ్యం, ఆనందం మన వెంట ఉంటాయని అయ్యప్ప దీక్షలు నిరూపిస్తున్నాయని గురుస్వాములు వివరిస్తున్నారు.

## హిజ్రాలకు పోలీసుల కౌన్సిలింగ్


హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర.

**బంజారాహిల్స్, అక్టోబరు 14, ప్రభాతవార్తః**

హిజ్రాలకు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కెఎం రాఘవేంద్ర మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. తరుచూ రహదారులపై కూడళ్లలో నిలబడి వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడం, దుకాణ సముదాయాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు ఉంటే వెళ్లి యజమానులను వేధింపులకు గురిచేస్తున్నట్లు పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన దాదాపు 20 మందికిపైగా హిజ్రాలను బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. డబ్బుల కోసం వేధించినా, వాహనదారులను, యజమానులను ఇబ్బందులు గురిచేసినట్లు ఫిర్యాదు అందితే సహించేది లేదని తేల్చిచెప్పారు. అలాంటి వారిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరిపై నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

నిట్ నం.36. పనిపేరు : GHMC, సర్కిల్-11, రాజేంద్రనగర్‌లో సీటీ స్వచ్ఛతకు హైయాసింత్ (గుర్రపు డెక్క) తొలగింపు మరియు బ్యారికేడింగ్ ఏర్పాటు. మరియు వ్యర్థా పదార్థాలు మరియు వెతకుపుల తీసివేత మరియు పరిశుభ్రత, స్మశానవాటిక పరిశుభ్రత మరియు క్లియరింగ్, దీపావళి పండుగకు స్మశానవాటిక యొక్క ఏర్పాట్లు యొక్క 05నం. పనుల కొరకు. అంచనా మొత్తం/ECV: రూ.7.05 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ, సమయం, తేదీ: 14.10.2025 ఉ.11.00గం. వద్ద. బిడ్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : తేదీ: 17.10.2025 ఉ.11.01గం. వద్ద. EE/SE పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నం.11, GHMC సెల్ నం: 9989930608, ఇ-మెయిల్ id- eec11.ghmc2@gmail.com.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (RJNR) GHMC.
DIPR.NO. 9185-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 14.10.2025

IN THE COURT OF THE HON'BLE II AJCJ-CUM-II AJMFC MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUSHAIGUDA
O.S. NO. 651 OF 2025
BETWEEN:
NAMILLA SURENDAR NAMILLA SANDEEP KUMAR ...PLAINTIFFS
AND
THE TAHSILDAR KEESARA MANDAL
ALL CONCERNED ...DEFENDANTS

Take notice that the above named plaintiffs Namilla Surendar & Namilla Sandeep Kumar have filed the above Suit for Declaration of Legal Heir of Late Smt. Namilla Uma W/o. N. Surendar who died intestate on 05.05.2021. The above suit is posted for the appearance of defendants on 16.10.2025.The defendants or any persons having any objections regarding the claim of the plaintiff, then they should appear before the Hon'ble Court on16.10.2025 at 10.30 A.M. either in person or through Advocate failing which the matter will be decided in accordance with law.

(BY ORDER OF THE HON'BLE COURT)
RAHUL MISHRA
ADVOCATES
Off: #7-1-123,TPSKN COLONY, GODUMAKUNTA, KEESARA MANDAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT-501301.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-IV ADDL., JUDICIAL MAGISTRATE, MEDCHAL MALKAJGIRI COURTS, UPPAL AT L.B.NAGAR
O.S.No. 88 of 2023
Between:
Canara Bank, Nagole Branch, Medchal Malkajgiri ....Plaintiff
And
M/s Sweety Herbal Beauty Parlour ....Defendant
To
M/s Sweety Herbal Beauty Parlour, Represented by its sole. Proprietor Smt Akarapu Sujatha, W/o Akarapu Babu Rao, aged about 50 years, Occ: Business, R/o Plot No.381 & 382, Budha Nagar, Peerzadiguda, Boduppal R.R. Dist., (Medchal-Malkajgiri). PH NO: 9701112627.

to Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.5,60,294/-** together with costs and future interest. You are hereby summoned appear before the Hon'ble Court in person on the **27th November, 2025, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N. Venugopala Rao
Advocate
1-2-234/2/1, Plot No. 2/P, Road No. 4, SRL Colony, Kothapet, Hyderabad.
Ph: 9849264568

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS :: RANGA REDDY DISTRICT COURT :: AT:: HAYATHNAGAR
O.S. NO. 855 OF 2025
Between:
Pandiri Sudha & 2 other, ...Plaintiffs
And
Tahsildar, Hayathnagar Mandal, & All Concerned, ...Defendants
TO,
D2). All Concerned, ...Defendant No.2

Please take notice that the above O.S. No. 855 of 2025 filed against defendant No.1 and you the all concerned for Declaration of title and legal Heir, and was pending before the Hon'ble Principal Junior Civil Judge, at Hayathnagar, R.R.District court. The above suit was posted to 24.10.2025 and you the concerned persons if any, are hereby called upon to appear in the court on that day at 10.30 A.M. either in person or through an advocate, if you failed to attend the court on that day the suit will be disposes Ex-party against you the all concerned.

(BY ORDER OF THE COURT)
Manda Law Firm
M.Srinivas Reddy
(Advocates)
Plot No. 37, Road No.1, Visvesvarayya Engineers Society, Hastinapuram, Ranga Reddy District.
9848159089

IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT L.B. NAGAR
O.S. No. 764 of 2025
Between:
BEJGUM ARUNA JYOTHI & others ...Plaintiffs
AND
1. The Tahsildar, Saroornagar Revenue Mandal, Ranga Reddy District.
2. All Concerned ...Defendants
To,
All Concerned.

Please take notice that the above named Plaintiffs filed suit for Declaration to declare the Plaintiffs herein are the legal heirs of Late Bejgum Bhaskar and the same is stand posted to 06-11-2025 if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

SCHEDULE OF PROPERTY
All that Open Land bearing Plot No. 138, admeasuring 505 Sq. Yards., Out Of 84.16 Gts., equivalent to 422 Sq. Mtrs., in Sy. No. 767, Situated at Lokayauta Colony of NADERGUL VILLAGE, Saroornagar Revenue Mandal, Ranga Reddy District, under Badanpet Nagara Panchayath, Registration District Registrar Office, Ranga Reddy District., and bounded as follows: **NORTH :** 30' WIDE ROAD. **SOUTH :** PLOT No.167. **EAST :** PLOT No.137. **WEST :** PLOT No.139.

//By order of the Hon'ble Court//
K. RAJU
B. CHIRANJEEVI
Advocates
Office at Badangpet, R.R. Dist, TG.
Cell No. 98484 99891

## బలరాంనగర్‌లో డ్రైనేజీ, సిసి రోడ్ల పనులు ప్రారంభం



**నేరెడ్‌మెట్, అక్టోబర్ 14,ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి డివిజన్ బలరాం నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ల పనులను కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. కొంత మంది అధికారుల నిర్లక్ష్యం, ప్రణాళిక లోపం వల్ల బడ్జెట్ వృథా అవుతోందని హెచ్చరించారు.అదేవిధంగా ఉత్తమ్‌నగర్-ఏవోసీ సెంటర్ రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన కార్పొరేటర్ వెంటనే బి టి మిక్స్ బండిని పిలిపించి గుంతలు పూడ్చించారు. మరిన్ని బండ్లు పంపాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ నవీన్, రమేష్, కాలనీవాసులు హిమావంత్, రఘువీర్ సింగ్,వెంకటేష్ గోపాల్ సింగ్,ప్రశాంత్,రాము, సౌభాగ్యలక్ష్మీ అమ్ములు,సుబ్బారావు,విజయేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## పర్యావరణ సుస్థిరాభివృద్ధి కోసం అవగాహన



**నేరెడ్ మెట్, అక్టోబర్ 14,ప్రభాతవార్త**
మల్కాజ్గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, జాతీయ హరిత దళం సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ సుస్థిర అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత వస్తువుల ప్రదర్శనను ఏర్పాటు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా సందర్శించారు.ప్రదర్శనలో దీపావళి సందర్భంగా వాడే మట్టి ప్రమిదలు, సాంప్రదాయ పద్ధతిలో చేసిన వంటకాలు, పునర్వినియోగ వస్తువులు వంటి పర్యావరణ స్నేహపూర్వక వస్తువులను ప్రదర్శించారు. విద్యార్థులు ఈ స్టాళ్లను సందర్శించి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన పొందారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ - పర్యావరణ సుస్థిరత అంటే భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సహజ వనరులను జాగ్రత్తగా వినియోగించడం. కాలుష్యాన్ని తగ్గించడం, పునరుత్పాదక శక్తి వనరులను ప్రోత్సహించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది" అన్నారు. జాతీయ సేవా పథకం కార్యక్రమాధికారులు డాక్టర్ జగన్, డాక్టర్ హరిత, డాక్టర్ ప్రదీప్ ప్రసంగించి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ హరిత దళం రాష్ట్ర దర్శకుడు చైతన్య, తెలంగాణ ప్రభుత్వం నియమించిన సుస్థిరాభివృద్ధి సలహాదారు అక్షయ్ దేశ్‌పాండే ముఖ్య వక్తలుగా పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది విస్తృతంగా పాల్గొన్నారు.

## మెగా పోటీలు - విద్యార్థుల ప్రతిభకు వేదిక



**తుర్కయంజాల్ అక్టోబర్ 14,ప్రభాతవార్త**
తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వెంకటేశ్వర కాలనీ, ఇంజాపూర్ ఈనెల 5 6 తేదీలలో ఢిల్లీలో జరిగిన 12వ మెగా కాంపిటీషన్లో ఇంజాపూర్ అకాడమిక్ పబ్లిక్ స్కూల్లోని విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పాఠశాల స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు జరిగిన ఈ పోటీల్లో ఫైన్ ఆర్ట్స్, క్విజ్, అకాడమిక్స్, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 37 మెడల్స్ కైవసం చేసుకున్నారు . విద్యార్థులు తమ సృజనాత్మకతను, జ్ఞానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అద్భుతంగా ప్రదర్శించారు అని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, తెలియజేశారు. విజేతలైన విద్యార్థులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందజేసి ఈ పోటీల ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ భావనను పెంపొందిస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తాము అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీమతి అరుణ, విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను చాటాలని తెలియజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు తదితరులు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి బస్తీ బాట చక్కని మార్గం : కొప్పుల



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

**హయత్ నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**
క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి అధికారులు నేరుగా ప్రజల మధ్యకు రావడం మంచి పరిణామమని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్ నగర్ లోని వినాయక్ నగర్ కాలనీ ఫేస్-2 లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని గృహ వినియోగ దారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్, లోవోల్టేజ్ సమస్యలు, వీధి దీపాలలో లోపాలు వంటి అంశాలను కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని ప్రతి కాలనీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి, విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం అవసరమన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలతో సమన్వయం చేసుకుని తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. బస్తి బాట కార్యక్రమంతో కాలనీల్లో సింగిల్ ఫేస్, త్రీఫేస్ కరెంట్ సమస్యలతో పాటు పాత స్తంభాలు, ప్రమాదకర వైర్లు మార్చడం వంటి విద్యుత్ సమస్యలన్నీ పరిష్కారం అవుతా యన్నారు.. కార్యక్రమంలో ఏఈ మిరాజుద్దీన్ ఖాద్రి, లైన్ మెన్ యాదయ్య, కాలనీ సభ్యులు రుక్మారెడ్డి, ప్రవీణ్ గౌడ్, రవితేజ, మల్లికార్జున, మురళీధర్ రెడ్డి, సంజీవ రెడ్డి, రాంరెడ్డి, యాదయ్య, పద్మారావు పాల్గొన్నారు.

## పార్క్ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను రద్దు చేయాలి



రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీవాసులు.

**వనస్థలిపురం. అక్టోబర్.14.ప్రభాతవార్త**
బి.యన్ రెడ్డి నగర్ పరిధిలోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అట్టి రిజిస్ట్రేషన్ లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని వారి కార్యాలయంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి కాలనీ వాసులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్లో శ్రీపురం కాలనీ ఉంది. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం సాహెబ్ నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 200 లో ఈ కాలనీ ఉంది. 1967లో కాలనీ లేఅవుటు ఏర్పాటు చేసిన సందర్భంలో సుమారు 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం మరియు కొన్నిచోట్ల కమిటీ హాల్ కోసం, క్రీడా ప్రాంగణం కోసం స్థలాలను వదిలి పెట్టడం జరిగింది. అందులో భాగంగా పార్కు స్థలములో ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు వెచించి పార్కు స్థలమును అభివృద్ధి చేయడం జరిగింది.అట్టి స్థలములను కొందరు వ్యక్తులు వనస్థలిపురం ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ గారితో కలిసి అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి వనస్థలిపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది కావున ఇట్టి రిజిస్ట్రేషన్ పత్రాలను వెంటనే రద్దుచేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలని మరియు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ గారి పైన మరియు రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల పైన చట్టపరమైన మరియు న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని కోరడం జరిగింది. స్పందించిన మంత్రిగారు త్వరలోనే సంబంధిత వ్యక్తులపై మరియు ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ పైన పూర్తి విచారణ జరిపించి కాలానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాల్వ శ్రీధర్ రెడ్డి, పాశం విట్టల్ రెడ్డి, కల్లు విష్ణు వర్ధన్ రెడ్డి,కండె రాజేందర్, చిగురింత శ్రీధర్ రెడ్డి ,జెల్ల రాములు మరియు తదితరులు ఉన్నారు.

## మోదీ ఫోటో ఫోజులు వద్దు, సఫాయిల కడుపు నింపు : భాస్కర్




**తుర్కయంజాల్ అక్టోబర్14, ప్రభాతవార్త**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ సఫాయిల కాళ్లు కడుతూ ఫోటోలకు పోజు ఇవ్వడం తప్ప కార్మికుల కడుపు నింపింది ఏం లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఐదవ మహాసభలు రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా రాగన్నగూడ సిఐటియు కార్యాలయం నుంచి భారీ సంఖ్యలో కార్మికులు ర్యాలీగా మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు. మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి డి కిషన్ అధ్యక్షత జరిగి న ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసత్వంలోకి నెట్టేస్తూ బడా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడుదారుల కొమ్ముకాస్తుందని అన్నారు. కేంద్రంలో ప్రధాని మోడీ పేదలు కార్మికులు పక్షాన మాట్లాడుతున్నట్టు ప్రగల్భాల్ పలకడం తప్ప ఇప్పటివరకు కార్మికుల సమస్యలను ఒక్కటి కూడా పరిష్కరించింది లేదన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మికులను పెట్టుబడుదల చేతుల్లో బానిసలుగా తయారు చేస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్ వి రమ, రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం, రాజమల్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, చంద్రమోహన్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు ట్రెజరర్ ఎల్లేష్ ప్యాట్రన్స్ టీ నర్సింహ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.జగదీష్ వై స్వప్న, దేవేందర్, జిల్లా నాయకులు శేఖర్,చందు నాయక్, పాండు, ఎల్లయ్య, యం సత్యనారాయణ, యాదగిరి. తదితరులు పాల్గొన్నారు

## బిసిలు ఐక్యంగా తమ సత్తా చాటాలి : జెఎసి నేతల పిలుపు



చిలుకానగర్‌లో జరిగిన బిసి ఐక్య జెఎసి సమావేశంలో పాల్గొన్న చిలుకానగర్ బిసి సంక్షేమ సంఘం నేతలు

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్‌లో బీసీల ఐక్యతను చాటాలని బిసి జెఎసి చిల్కా నగర్ కమిటి నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు చిలుకానగర్‌లో జరిగిన బిసి జెఎసి సమావేశంలో పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిసిలు రాష్ట్ర బంద్ ద్వారా బిసిల ఐక్యతను చైతన్యాన్ని చాటి చెప్పాలని కోరారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశానికి వినిపించడం కోసమే బంద్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. బిసిలకు న్యాయబద్ధంగా రావాల్సి న రిజర్వేషన్లను కోర్టులను వేదికలుగా చేసుకొని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే బిసి ఉద్యమం వ్యక్తుల ప్రయోజనాల కోసం కాదని బీసీ వ్యవస్థకు మేలు జరిగే ఉద్యమన్నారు. అన్ని రాజకీయ పార్టీలో ఉన్న బిసి శ్రేణులు కలిసి వచ్చి ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం 36 మంది సభ్యులతో చిలుకానగర్ బిసి జెఎసిని ఏర్పాటు చేశారు.ఈ కమిటిలో పుప్పాల వెంకటేశ్వర్లు, గజ్జెల సత్యరాజ్ గౌడ్, బోడ విద్యాసాగర్, తెలంగాణ సంపత్, అంబటి జగదీష్, దేవసాని బాలచందర్, నెర్థం భాస్కర్ గౌడ్, గోనె అంజయ్య, కె.అశోక్ చారి,జెల్లి మోహన్, రామరాజు యాదవ్, స్వామి యాదవ్, ఒర్సుశేఖర్, గోనె శ్రీకాంత్, తన్నీరు కొండల్ రావు, రాగిరి జ్ఞానేశ్వర్, పిట్టల నరేష్, సకినాల ప్రసాద్ నేత, కొయ్యడ ప్రసాద్ నేత, శనిగరం తిరుమలేష్, పలుగుల యాదగిరి, కావలి నరసింహ, బజారు జగన్ గౌడ్, గుర్రాల మల్లేష్, పెండెం నాగరాజు,పల్లె రాజ్ కుమార్ గౌడ్, శివ కోటి, కొంపల్లి రవి, నరసింహ చారి, కొంపల్లి బాలరాజు, సీతారామచారి, ఆలే నరేందర్, బూర్గుల రమేష్ గౌడ్, పైడిపాల సాయిలు, షామీర్ పేట్ చంద్రయ్య, కొర్ర కృష్ణ నాయక్, డాక్టర్ అశోక్, పి. రవీందర్‌లను కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతలు పండ్ల కిషన్ గౌడ్, వెంకన్న,బజార్ హేమంత్ గౌడ్,రామగిరి సురేష్, మట్ట రమేష్ గౌడ్, నాగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను ఇస్తా

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



దివ్యాంగుడు అందజేసిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలో పేద దివ్యాంగులను ఆదుకుంటామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఓ వృద్ధ దివ్యాంగుడు తన దీన పరిస్థితిని సబితారెడ్డికి వివరించారు. ఈ మేరకు తనకు సాయం అందించాల్సిందిగా వినతి పత్రం అందజేసి వేడుకున్నాడు. దీంతో స్పందించిన ఆమె వారం రోజుల లోపు బ్యాటరీతో నడిచే మూడు చక్రాల ట్రై సైకిల్ వాహనాన్ని అందజేస్తామని సదరు దివ్యాంగునికి హామీనిచ్చారు. తన వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై సంతోషం వ్యక్తం చేసిన దివ్యాంగుడు సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

### జిల్లెలగూడ చందన చెరువులో మహిళ మృతదేహం

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువులో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సమతానగర్ కాలనీకి చెందిన మీసాల కమల అలియాస్ యాదమ్మ (52) అనే మహిళ మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. అయితే మంగళవారం ఉదయం జిల్లెలగూడ చెరువులో మహిళ మృతదేహం తేలియాడుతుండడంతో గమనించిన వాకర్స్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన డిఆర్‌ఎఫ్ సిబ్బంది బోటు ద్వారా చెరువులో నుండి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతి చెందిన మహిళ కమల గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి తర్వాత బంధువులకు అప్పగించారు.కేసునుమీర్‌పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చెరువు నుండి మహిళ మృతదేహాన్ని వెలికి తీస్తున్న డిఆర్‌ఎఫ్ సిబ్బంది

## జల్‌పల్లిలో హనుమాన్ ఆలయ భూమిని కాపాడాలి: బిజెపి



హనుమాన్ విగ్రహానికి పూజలు చేసి స్థలాన్ని పరిశీలించిన బిజెపి నేతలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి సమీపంలో ఆక్రమణకు గురవుతున్న హనుమాన్ దేవాలయానికి సంబంధించిన స్థలాన్ని పరిరక్షించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీకి చెందిన పలువురు హనుమాన్ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల్‌పల్లి సమీపంలో పురాతన కాలం నాటి హనుమాన్ ఆలయానికి చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేసిన విషయంపై పహాడీషరీఫ్ పోలీసులకు, స్థానిక మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దేవాలయ భూమిని రక్షించడానికి బిజెపి పోరాటం చేస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి బిజెపి అధ్యక్షుడు మనోజ్, బడంగ్‌పేట్ మున్సిపల్ కా ర్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి లతో పాటు గురిగె శ్రీకాంత్, బాల శివుడుగౌడ్, గౌర మురళి, రావుల భరత్, హరికృష్ణ, గుర్రం శివ, రాకేష్, రవి, కొంతం మురళీధర్‌రెడ్డి, రామాచారి, కళ్లెం మురళీధర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, పవన్, సతీష్, నర్సింహ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలంలను కాపాడండి

**మేడిపల్లి ,అక్టోబర్ 14 ప్రభాతవార్త ;** మేడిపల్లి మండలం పరిధిలో జంట కార్పొరేషన్ లో ప్రభుత్వ స్థలములను కబ్జాల నుంచి రక్షించాలని మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ మేడిపల్లి తహసిల్దార్ హసీనా కు వినతిపత్రం ఇవ్వడం జరిగినది. రచ్చ కిషన్ మాట్లాడుతూ.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ నగర్ ఫేస్ 3 బిస్కెట్ గోదాం దగ్గర , డబల్ బెడ్ రూమ్ దగ్గర , హెచ్ పి పెట్రోల్ బంక్ వెనకాల ప్రభుత్వ స్థలంలో భూ కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేయుచున్నారు. వీటిని వెంటనే వీటిపై చర్యలు తీసుకొని వెంటనే తొలగించాలని భూకబ్జాలు దారుల పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేనిచో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని తెలిపారు .

## డ్రైనేజి పైప్‌లైన్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్



డ్రైనేజి పనులను పరిశీలిస్తున్న నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
వీలైనంత త్వరగా భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి సిబ్బందికి సూచించారు. ఇటీవలి భారీ వర్షాలకు హయత్ నగర్ డివిజన్ పద్మావతి కాలనీలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ కుంగి పైప్ లైన్ ధ్వంసం కాగా... అక్కడ కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మత్తు పనులను మంగళవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులను నాణ్యతతో పూర్తి చేసి సాధ్యమయినంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజ్ గోపాల్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

### మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలి : కోట్ల శ్రీనివాస్



మార్కెటింగ్ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్‌ను సన్మానిస్తున్న ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** వ్యవసాయ, సహకార మరియు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్‌ను మంగళవారం హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసారు. హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటి గార్డ్స్, నూతన పారిశుద్య యంత్రాలు, సిబ్బంది కొరత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోట్ల శ్రీనివాస్ కోరారు.

### మోడల్ అపార్ట్‌మెంట్‌గా జనప్రియ : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



జనప్రియలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో రూ.18లక్షల వ్యయంతో పిల్లల కోసం ఆధునిక ప్లే పార్క్ ఏర్పాటు పనులను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో సిసి రోడ్లు, ఓపెన్ జిమ్, వీది దీపాలు, డ్రైనేజీ సదుపాయాలు ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పిల్లల కోసం ఆట పరికరాలు, స్లైడ్స్, స్వింగ్స్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తూ జనప్రియను మోడల్ అపార్ట్‌మెంట్‌గా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సభ్యులు జ్యోతిరెడ్డి, కళ, శాంత, మానస, నవీత, అరుణ, అనురాధ, యశోద తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఖిల్లామైసమ్మ దేవాలయంలో బహిరంగ వేలం

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ లోని శ్రీఖిల్లామైసమ్మ దేవాలయంలో పూజ స్టోర్ నిర్వహణ కోసం వేలంపాట నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ కె. సురేంద్రకుమార్, కార్యనిర్వాహణాధికారి దేవరశెట్టి ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. పూజ స్టోర్‌లో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయించుకునే హక్కు కోసం ఈనెల 15వ తేదీ బుధవారం దేవాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నియమ నిబంధనలకు లోబడి వేలంపాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.

## నవీన్‌యాదవ్ గెలుపు ఖాయం



నవీన్ యాదవ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జగన్‌యాదవ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి జగన్‌యాదవ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంగళవారం యూసఫ్‌గూడా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని పరిశీలిస్తున్న ప్రజలు జూబ్లీహిల్స్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీకి కట్టబెడతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని టిఆర్‌ఎస్, బిజెపి అభ్యర్థులు తట్టుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌రెడ్డి, శ్యాంసుందర్, హరీష్, ప్రణవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తారు



ప్రచారం నిర్వహిస్తున్న మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎన్నికలను పురస్కరించుకొని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటీఆర్ పిలుపు మేరకు, ఎల్బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా మంగళవారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని వెంగలరావు డివిజన్ మధురానగర్ కాల నీలో స్థానిక కార్పొరేటర్ దేదీప్యతో కలిసి చైతన్యపురి డివిజన్ టిఆర్ ఎస్ పార్టీ నాయకులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ బిఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జలంధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



ఇందిరానగర్‌లో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైనేజీ, సివరేజీ పనులు, సిసి రోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాఘవేంద్రనగర్, సాయిరాం నగర్ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. అదే విధంగా ధర్మపురికాలనీలో రూ.14 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు, బీరప్ప గడ్డ, ధర్మపురి కాలనీలో రూ.24 లక్షల వ్యయంతో సీవరేజ్ పైప్ లైన్ పనులను చేపడుతున్నామని తెలిపారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాదిక, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, ఉపేందర్, బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల రెడ్డి, కొక్కంద జగన్,ఎం. శ్రీనివాస్ యాదవ్,వేణు, మార్క శ్రీను, గణేష్, చిన్న, సత్యనారాయణ, జంగయ్య పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

## రూ.20లక్షలతో భరత్‌నగర్‌లో డ్రైనేజీ పనులు



ఉప్పల్ భరత్‌నగర్‌లో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పాత భరత్‌నగర్‌లో రూ.20లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పాత భరత్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. త్వరలోనే స్ట్రామ్ వాటర్ డ్రైన్‌తోపాటు, సిసి రోడ్డు పనులు చేపడుతామని ఆమె తెలిపారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సత్యనారాయణ,సల్లా ప్రభాకర్ రెడ్డి, ముత్యంగారి రామ్, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి,గోరిగె చిరంజీవి, కర్రె రాజు, హరిబాబు, నవీన్, గోరిగె కలమ్మ, ఆలే మల్లేష్, వెంకటేష్,బట్కిరి శివ, నరేష్,రంగుల శేఖర్, వంశీగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు

## నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
నాచారం డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ఆర్ పేర్కొన్నారు. నాచారం డివిజన్లోని ఈఎస్ఐ హాస్పిటల్ లోపల నుండి చాలాకాలంగా ఉన్న ఓపెన్ నాలా పూడిక ఏర్పడి పూర్తిగా డ్రైనేజీలు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి రూ. 90 లక్షల రూపాయల వ్యయంతో భారీ వర్షపు నీటి డ్రైనేజీ నిర్మాణానికి, అదేవిధంగా అన్నపూర్ణ కాలనీలో సుమారు రూ. పది లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి మంగళవారం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం రమేష్ బాబు, నాచారం డివిజన్ బారాస పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, రామ్ రెడ్డి నగర్ కాలనీ సభ్యులు, అన్నపూర్ణ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీఐ గోవిందరెడ్డి



**బోడుప్పల్ అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని,టెక్నాలజీ మంచికి మాత్రమే ఉపయోగించుకోవాలని మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి సూచించారు.ఈ సందర్భంగా మంగళవారం బోడుప్పల్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు మంచి,చెడుల గురించి తెలుసుకోవాలన్నారు. తల్లి దండ్రులను, గురువులను గౌరవించాలని కోరారు.యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, టెక్నాలజీని మంచి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు నర్సింగ్ రావు, తిరుపతి, కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో పేకాట రాయుళ్ల అరెస్ట్

**మేడిపల్లి , అక్టోబర్ 14 ప్రభాతవార్త :** పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మేడిపల్లి మండలం ప్రశాంత్ నగర్ కాలనీలో ఓ ఇంట్లో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు రైడ్ చేయగా పేకాట ఆడుతున్న వ్యక్తులు సంతోష్ కుమార్, సంతోష్, వీరన్న, గణేష్ లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు వేల రూపాయల నగదు, ప్లేయింగ్ కార్డు,ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ గోవింద రెడ్డి తెలిపారు.